‘రైల్వేలైన్’ పరిహారమెప్పుడు?

- ఐదేళ్లవుతున్నా అందలే
- నిరాహార దీక్ష చేసినా స్పందన లేదు
- కొత్త ప్రభుత్వంలోనైనా వచ్చేనా?
- రంగారావుపల్లి, తాడిజర్రివాసుల ఎదురుచూపు


నిరాహార దీక్ష చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

గంగాధర: కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు పరిహారం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. పక్కనున్న గ్రామాల రైతులకు మంజూరై, ఏడాదిన్నర కావస్తోందని.. తమకు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయి గతేడాది నెల రోజులపాటు నిరాహార దీక్షలు చేసినా గత ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పుడైనా పరిహారం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

2019లో చెక్కులిస్తామన్నారు..

గంగాధర మండలంలోని గర్శకుర్తి, ఉప్పరమల్యాల, కురిక్యాల రెవెన్యూ గ్రామాల పరిధి నుంచి కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనులు చేపట్టడానికి అధికారులు భూసేకరణ చేశారు. గర్శకుర్తిలో 43, కురిక్యాలలో 33.21, ఉప్పరమల్యాలలో 50.06 ఎకరాలు సేకరించారు. ఇందుకోసం రైతులను ఒప్పించి, సంతకాలు తీసుకున్నారు. 2019 మార్చి 26న నిర్వాసితులకు పరిహారం చెక్కులు అందిస్తామని చెప్పారు. కానీ, కరోనా కారణంగా ఇవ్వలేదని రైతులు తెలిపారు. పరిహారం కోసం అధికారులు చుట్టూ తిరగగా గతేడాది కురిక్యాల రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు మంజూరు చేశారు. ఉప్పరమల్యాల, గర్శకుర్తి రెవెన్యూ పరిధిలో భూములు, ఇళ్లు కోల్పోతున్న తాడిజర్రి, రంగారావుపల్లి గ్రామాలకు చెందినవారికి ఇవ్వలేదు. ఐదేళ్లవుతున్నా తమకు ఇవ్వకపోవడం ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

ధర మూడింతలైంది



ఐదేళ్ల కింద పరిహారం ఇస్తామన్నప్పటికి, ఇప్పటికి భూమి ధర మూడింతలైంది. గతంలో ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలుంటే ఇప్పుడు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు ఉంది. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి. – రవీందర్, రంగారావుపల్లి

రేపుమాపు అంటున్నరు



రైల్వేలైన్ కింద మాది ఐదెకరాల భూమి పోతోంది. పరిహారం కోసం ఎదురు చూస్తున్నాం. మా పక్క గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులకు మంజూరైంది. మాకేదని అధికారులను అడిగితే రేపుమాపు అంటున్నరు. – సందెవేణి లక్ష్మణ్, తాడిజర్రి

మంత్రి ‘పొన్నం’పై విమర్శలను సహించం

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఆ స్థాయి లేదు
- కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్


మాట్లాడుతున్న ప్రణవ్

హుజూరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు చేస్తే సహించమని, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఆ స్థాయి లేదని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పొన్నం ఉద్యమకారులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రేతో దాడి చేసినా పోరాడిన నాయకుడని కొనియాడారు. గత ఎన్నికల్లో కౌశిక్‌రెడ్డి సెంటిమెంట్‌తో గెలిచారని ఆరోపించారు. రెండో విడత దళితబంధు నిధులు అడ్డుకున్నది ఎవరో అందరికీ తెలుసన్నారు. నిధులు విడుదల చేసేందుకు సమయం ఉన్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసిందని మండిపడ్డారు. ప్రజాతీర్పును గౌరవించి, ప్రజాప్రతినిధిగా కొనసాగాలని సూచించారు. బెదిరింపు రాజకీయం చేయడానికి ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని, ప్రజల చేత ఎన్నుకోబడిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వమని పేర్కొన్నారు.

అయోధ్య రాములోరి చిత్రపటాల పంపిణీ


స్వామివారి చిత్రపటాలు ఇస్తున్న నాయకులు

మానకొండూర్: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో అయోధ్య రాములోరి చిత్రపటాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు భాస్కరాచారి మాట్లాడుతూ.. ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో స్వామివారి ఫొటోలు పంచడం శుభపరిణామమని పేర్కొన్నారు. నాయకులు లక్ష్మణాచారి, ప్రభాకర్, అనిల్, తిరుపతిరెడ్డి, బలరాం, మహేందర్‌రెడ్డి, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు

గన్నేరువరం: మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా గన్నేరువరం గ్రామానికి చెందిన వారియర్స్ టీంకు మాజీ వార్డు సభ్యుడు రామంచ స్వామి బుధవారం టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమ్మక్క భక్తులకు వసతులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్


పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

శంకరపట్నం: సమ్మక్క జాతరకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలో జరుగుతున్న జాతర పనులను ఆయన పరిశీలించారు. భక్తులకు తాగునీరు, మహిళలకు తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలోని పాత పంచాయతీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఎంపీవో బషీరొద్దీన్, సెక్రటరీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు సరిపడా నిధులేవి?

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

జమ్మికుంట: ఆరు గ్యారంటీలకు సరిపడా నిధులను ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ వివిధ డిక్లరేషన్లు ప్రకటించిందని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, కల్యాణలక్ష్మి, అర్హులైన పేదలకు ఇళ్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్ వంటివాటికి కేటాయింపులు, నిర్ణయాలు లేవని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు కూలీలకు వ్యతిరేకంగా పని చేస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా రైతు ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలో రైతులపై పోలీసులు, పారా మిలటరీ బలగాలతో లాఠీచార్జి చేయించడం దారుణమని పేర్కొన్నారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, చెల్పూరి రాములు, దండిగారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతాంగ, ప్రజాసమస్యల పరిష్కారానికై ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని పలు రాజకీయ, విద్యార్థి, యువజన, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు సమావేశం ఏర్పాటు చేసుకున్నాయి. అలాగే విద్యార్థి యువజన సంఘాలు బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసుకొని భారత్‌బంద్‌లో భాగస్వామ్యం కావాలని నిర్ణయించాయి. ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జాయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో దేశవ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో కాంగ్రెస్, తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథ, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని వామపక్ష విద్యార్థి నాయకులు మచ్చ రమేశ్ (ఏఐఎస్ఎఫ్), గజ్జల శ్రీకాంత్(ఎస్ఎఫ్ఐ), ప్రతాప్ (పీడీఎస్‌యూ), కుమార్ (పీడీఎస్‌యూ)లు తెలిపారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమ్మెలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, కసిరెడ్డి సందీప్, మచ్చ పవన్ తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు


పాటిమీద జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో పూజలు


జమ్మికుంట: శిశుమందిర్ పాఠశాలలో అక్షరాభ్యాసం

హుజూరాబాద్: పట్టణ శివారు రంగనాయకుల గుట్ట వద్ద గల పాటిమీద ఆంజనేయ స్వామి, జ్ఞాన సరస్వతీ దేవి ఆలయాల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు జరిగాయి. ఆలయ ఆవరణలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో పూజలు నిర్వహించారు.

సామూహిక అక్షరాభ్యాసం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతి హోమం చేశారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు పలకలు, పెన్సిళ్లు, ప్యాడ్‌లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాసం నగేశ్, యాద శ్రీధర్, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీ ఆలయంలో..

చొప్పదండి: మండల కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

గంగాధర: వసంత పంచమి సందర్భంగా బుధవారం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సరస్వతి విగ్రహం వద్ద లెక్చరర్లు, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రమీల మాట్లాడుతూ.. త్వరలో పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి, మంచి స్థాయిలో ఉండాలని సూచించారు.

రామడుగు మండలంలోని పాఠశాలల్లో..

రామడుగు: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి పూజ నిర్వహించి, విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


చొప్పదండి: అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


గంగాధర: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

థాయిలాండ్‌లో భారత రాయబారిని కలిసిన మల్లారెడ్డి


పాలోమి త్రిపాఠితో మల్లారెడ్డి

కరీంనగర్ సిటీ: ఎస్సారార్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో గల చూలాలాంగ్ కార్న్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. అక్కడి సౌత్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ సెంటర్‌లో నిర్వహించిన అకాడమిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న థాయిలాండ్‌లోని భారత రాయబారి పౌలోమి త్రిపాఠిని మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రెండు దేశాల పురాణాల్లో ఉన్న రామాయణం, ఇతర దేవతల సారూప్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా అక్కడి కోర్సులు, కరిక్యులం, అడ్మిషన్ విధానం, పరీక్ష విధానం, తదితర అంశాల గురించి వివరాలు సేకరించారు.

రచయిత్రి ప్రీతికి మరో ప్రతిష్టాత్మక అవార్డు


అవార్డుతో రచయిత్రి ప్రీతి

కరీంనగర్ సిటీ: నగరంలోని బ్యాంక్‌కాలనీకి చెందిన రచయిత్రి ప్రీతిరిచర్డ్స్ మరో ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. గతంలో తాను రాసిన పలు కవితలకు పలు జాతీయ అవార్డులు అందుకోగా తాజాగా కర్ణాటకలోని ప్రముఖ వేయిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూర్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రీతి రిచర్డ్స్‌కు యూనిటైడ్ ఇండియా నేషనల్ అవార్డు–2024 అందజేశారు. తాను రచించిన మెమోరిస్ అనే పుస్తకంతో పాటు సీడ్స్ అందించడం, మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహించినందుకు ఈ అవార్డును అందజేశారని ప్రీతి తెలిపారు. తన తండ్రి సహకారంతో ఈ ఘనత సాధించానని అన్నారు. ప్రీతికి అవార్డు రావడం పట్ల పలువురు కవులు, రచయితలు అమెను ప్రత్యేకంగా అభినందించారు.

విశాఖ ఫ్యూయెల్ ప్లాంట్ సందర్శన

కరీంనగర్ కార్పొరేషన్: విశాఖపట్నంలోని ఫ్యూయెల్ ప్లాంట్‌ను బుధవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సందర్శించారు. ప్లాస్టిక్ నుంచి డీజిల్, పెట్రోల్‌ను తయారు చేసే విధానంపై అధ్యయనం చేయడానికి కమిషనర్ శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ స్వామి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర కమిషనర్‌లతో కలిసి ప్లాంట్ పనితీరును పరిశీలించారు.

టీఏవైఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్

కరీంనగర్: తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం(టీఏవైఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామడుగు మండలం రంగసాయిపల్లెకు చెందిన చిలుముల నవీన్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. నవీన్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సంఘం అభివృద్ధికి పాటుపడుతానని అన్నారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్ ఊసేది?


మాట్లాడుతున్న బీసీ నాయకులు

కరీంనగర్: మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామన్న కాంగ్రెస్ పార్టీ తొలి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో దాని ఊసే లేదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వస్తే బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని, ఐదేళ్లకు లక్ష కోట్లు పూలే సబ్ ప్లాన్ తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మెనిఫెస్టోలో స్పష్టంగా తెలిపిందని అన్నారు. బడ్జెట్‌లో మాత్రం 60 శాతంగా జనాభా ఉన్న బీసీలకు రూ.8వేల కోట్లు కేటాయించడమేంటని ధ్వజమెత్తారు. ఈ నిధులు బీసీల అభ్యున్నతికి ఏమాత్రం సరిపోవని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, నాయకులు మెరుగు పరుశురాం, మధు, వాసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘కేసీఆర్ పాలనలోనే ఎక్కువ నష్టం’

విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన కంటే తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణానది నీటి తరలింపునకు కేసీఆర్‌రే కారణమని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఈ సత్యాన్ని ఇప్పటికైనా తెలుసుకోవాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, బ్యారేజీల బ్యాక్ వాటర్ వల్ల ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన మంచిర్యాల, మంథని ప్రాంత గ్రామాల్లోని 60 వేల ఎకరాలు ఏటా నీట మునుగుతున్నాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, తరాళ్ళ నరసయ్య, సీహెచ్ రామ్మూర్తి, గజ్జల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌గా అయాజ్


అయాజ్

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌గా ఎండీ.అయాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మికుంటలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ వరంగల్ జిల్లా నర్సంపేటకు బదిలీ అయ్యారు. సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎండీ.అయాజ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవో విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: ఎంపీడీవో విజయ్‌కుమార్ తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము, పోలు రమేశ్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట ఎంపీడీవోగా బాధ్యతలు


పుల్లయ్య

ఇల్లందకుంట: ఎంపీడీవోగా జె.పుల్లయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన తీగల శంకర్ గన్నేరువరానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోకు ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక కార్యకర్తకు మెగాస్టార్ అభినందన


నరేశ్‌ను అభినందిస్తున్న చిరంజీవి

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంకు చెందిన సామాజిక కార్యకర్త, బ్లడ్ డొనేషన్ మోటివేటర్ గొల్లపల్లి నరేశ్‌ను మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. 33 సార్లు రక్తదానం చేసి, తన మిత్రులతోనూ చేయించి యువతకు ఆదర్శంగా నిలిచావన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో చిరంజీవిని కలిశానని నరేశ్ తెలిపారు.

‘ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు అక్రమం’

హుజూరాబాద్: జన్వాడలో క్రైస్తవులు, చర్చిపై జరిగిన దాడికి నిరసనగా అక్కడికి వెళ్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మత ఘర్షణలకు తెర తీస్తున్నాయని మండిపడ్డారు. తమ అధ్యక్షుడిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

విద్యాసామగ్రి అందజేత


సామగ్రి పంపిణీ చేస్తున్న సునీల్

గన్నేరువరం: వసంత పంచమిని పురస్కరించుకొని గన్నేరువరం మండల కేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ చైర్మన్ బొడ్డు సునీల్ బుధవారం నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ భానుచైతన్య ప్రత్యేక పూజలు చేసి, విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బూర రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పట్టణ అధ్యక్షుడు సాల్లు బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరవుతారని పేర్కొన్నారు.